

సముద్రపు అలలు విరిగి విరిగి పడుతున్నాయి అయినాసరే హోరు మానలేదు. కొత్తఅలలు రావడం ఆగలేదు. సృష్టిలోని అతివిచిత్రమైన ఈ దృశ్యాన్ని అలా ఒంటరిగా చూస్తూ, ఎంతసేపు కూర్చున్నానో నాకేతెలియదు. ''హల్లో ఫ్రెండ్'' అన్న కేకతో ఈ లోకానికి వచ్చాను. ఇటుతిరిగి చూద్దును ఎదురుగా ఒకాయన కూర్చొని వున్నాడు—ఎక్కడో చూచినట్లుంది ఇతన్ని—ఎక్కడ??—అవును గుర్తొచ్చింది—ఎల్లమ్మకోటవద్ద మొన్న ఇంజనీరింగ్ స్టూడెంట్సుతో ఏదో ఘర్షణపడుతున్నాడు.

అతనేనా?—బాగా చూచాను.


అవును అతనే ఇతను. ఏమీ అనుమానం లేదు గతవారం కురుపాం మార్కెట్టువద్ద చెత్తకుండీలో నుండి మురికిగుడ్డ పీలికలు ఏరుకుంటున్నదీ ఇతనే—

నాకొక్కసారి భయం వేసింది—అయితే ఆ భయాన్ని పైకి కన్పడనివ్వలేదు. లోకంలో ఓ నైజగుణం వుంది. మనం భయపడి పరుగెత్తుతున్నట్లు చూచిందాకుక్క, ఇంక వెంటబడి తరుముతుంది. అది దగ్గరికి వచ్చినాసరే నిర్భయంగా నడుస్తుంటే సరి, వచ్చి ఓ సారి వాసనచూచి మరీ తన దోవన తాను వెళ్ళిపోతుంది. అందుకనే ఈయన పిచ్చివాడని తెలిసి కూడా లేనిగాంభీర్యం తెచ్చిపెట్టుకొని తొణకకుండా కూర్చున్నాను భయపడి పరుగెత్తానను కోండి—

మీదపడి కరిస్తే దిక్కేమిటి??

స్నేహితులు నలుగురూ కలిసి సద్ధర్మ సదనమునుండి గోశఅవతలి(పిచ్చాసుపత్రి)కి మార్చవలసి వస్తుంది నన్ను—''మే ఐ నో యువర్ గుడ్ నేమ్‌సార్—'' మీ శుభనామం తెలుసుకోవచ్చునా'' ఇంగ్లీషులోనే ప్రశ్నించాడాయన.

''రామారావు'' ముక్తసరిగా చెప్పాను.



# పిచ్చివాడి స్వర్గం

ముడిగొండ శివప్రసాద్

"నాపేరు బ్రిగిడియర్ డబ్ల్యు. హెచ్. కె. కె. ఎస్ ఎస్. ఆర్ ఆర్. టి వి. ఎస్ రావు—'

ఈ యన పిచ్చికి తగ్గట్లేవుంది పేరు కూడా బారెడు పొడుగున. ఇంగ్లీషుకేం ఇరవై ఆరు అక్షరాలున్నాయి — ఎన్ని కాంబినేషన్లనైనా చేయవచ్చు అలా. ఇంకో విశేషమేమిటంటె ఈయన ఇంగ్లీషులో నే మాట్లాడు తున్నాడు అయితే ఇలా ఇంగ్లీషులో మాట్లాడే పిచ్చివాళ్ళని. బిచ్చగాళ్ళనీ నేను చూడటం ఇదేమీ కొత్త గాదు. రైల్వేస్టేషన్ వద్దా. కింగ్‌జార్జి హాస్పిటల్ వద్దా ఇంగ్లీషులో ముష్టి ఎత్తుకునే వాళ్ళను నేను చూచాను లోగడ.

ఈ బ్రిగిడియర్ రావుకు ఎందుకు పిచ్చెక్కిందో??

కుటుంబ కష్టాలు కారణమా??

లేక ఆస్తి మొత్తమూ గుర్రప్పందాలలోనో లాటరీలోనో పోయిందా??

ఆదర్శవంతమైన సినిమాతీసి మొదటి వారంలోనే అది మార్నింగుషోలు ఆడుతుంటే చూచి మతిపోగొట్టుకున్నాడా??

ఆశయాల కోసం ఎన్నికలలోనికి దిగి ప్రతిపక్షీ (ప్రతిపక్షే) వైన్ & వుమెన్‌తో ఓటర్లలనే ముడిసరుకును కొంటున్నందుకు గుండెలు బాదుకొని పిచ్చివాడైనాడా?

ఈ బ్రిగిడియర్‌రావు జీవిత వృత్తాంతం ఏమిటి?

కనుక్కుంటే బాగుండును—

చెప్తాడా??

"ఏమిటి సీరియస్‌గా ఆలోచిస్తున్నారు;" బ్రిగిడియర్ నన్ను ప్రశ్నించాడు.

చూచాను. అతని కళ్ళు ప్రశాంతంగా వున్నాయి. పిచ్చిచూపులులేవు. పిచ్చికూడా పొరలు పొరలుగా తెరలు తెరలుగా వస్తుంటుందని విన్నాను. ఇప్పు డితనికి పిచ్చికాదేమో. చుట్టూ చూచాను ఇదే మంచి సమయం.

ఎవరూలేరు—దూరంగా రామకృష్ణాశ్రమం నుండి పూజాఘంటికలు విన్పిస్తున్నాయి. అర్జునుడి విషాదాన్ని పోగొట్టిన శ్రీకృష్ణునిలా ఓర్పుతో నేర్పుతో ధర్మోపదేశం చేస్తే బాగుండుననుకొన్నాను—తద్వారా లోకంలో ఒక పిచ్చివాణ్ణి ఉద్ధరించానన్న గౌరవం దక్కుతుంది.

"బ్రిగిడియర్‌గారూ మీ పరిస్థితే మీ బాగోలేదు"—అన్నాను మెల్లిగా—సమాధానంగా బ్రిగిడియర్ నవ్వాడు.

నేను మరికొంచెం ధైర్యం తెచ్చుకొని పురోగమించాను — "మీరిలా రోడ్డు ప్రక్కనా, రైల్వేస్టేషన్లవద్దా పిచ్చివాడిలా తిరుగుతూ కాలం వ్యర్థంచేస్తే లాభం ఏమిటి చెప్పండి. కాలం చాలా విలువైంది. దేశం చాలా ప్రమాదకర పరిస్థితిలో వుంది—ఈ నాడు సమాజానికి మీలాంటి వాళ్ళు చాలా అవసరం"

'నిజమే'నన్నట్లు ముఖంపెట్టి తల ఊపుతున్నాడు "మీవంటివాళ్ళు నిర్మాణాత్మక కార్యక్రమాలల్లో ముమ్మరంగా పాల్గొనాలి — విద్యార్థులకు క్రమశిక్షణ గూర్చి బోధించాలి. స్త్రీలకు వంట నేర్పాలి. కుటుంబనియంత్రణ ప్రచారం చేయాలి. శ్రమదానంతో రోడ్లు నిర్మించాలి. స్టేట్ లాటరీ టిక్కెట్లు అమ్మి సంక్షేమనిధులకు తోడ్పడాలి. ఇలా మీరు చేయవలసిన ప్రజోపయోగకర కార్యాలు ఎన్నో వుండగా, అలా పూర్ణాధియేటరువద్దా, పోస్టాఫీసు పక్కనా, కిర్లంపూడి హాస్టలు వెనుకా కురుపాం మార్కెటుముందు ఏమి పనిలేనట్లు తిరుగుతూ వుండటం నాకేమీ నచ్చలేదు. ఆ తర్వాత మీ ఇష్టం అన్నాను ముఖం అదోలా పెట్టి.

నా ప్రసంగ మంతావిని బ్రిగిడియర్ ఓ నవ్వు నవ్వి "అఫ్‌కోర్సు - అఫ్‌కోర్సు- మీరు చెప్పిందీ నిజమే" నన్నాడు. నాకు కొండంత ధైర్యం వచ్చింది. నా వ్యవసాయం ఫలిస్తున్నది. అందుకే అన్నారు మన పూర్వీకులు కృషితోనాస్తి దుర్భిక్షం అని—ఏ మందులూ టానిక్‌లూ లేకుండానే కరంటు చికిత్సలు చేయకుండానే ఈ బ్రిగిడియర్‌ను తిరిగి మనిషిగా చేస్తున్న ఘనత నాకే దక్కుతుంది—

ఓహో! ఈ విషయం మా హాస్టల్ స్టూడెంట్సుకు చెబితే వాళ్ళంతా నాకు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఓ సన్మానం ఏర్పాటు చేస్తారేమోనని ఆలోచిస్తున్నాను. బ్రిగిడియర్ సముద్రపు ఇసుకతో ఓ చిన్న పిచ్చుకగూడు కట్టి నా కళ్ళముందే దానిని కూల్చి, నన్నుచూచి "నేను పిచ్చివాణ్ణై ఇలా వ్యర్థంగా తిరుగుతున్నాను. ఇక నుంచైనా బాగా బతకాలని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

నా మనస్సు సంతోషసాగరంలో స్నానాలు చేసింది. ఉన్నట్టుండి బ్రిగిడియర్ కుడిచేతి చూపుడువ్రేలుతో ఇసుకను రుద్దుతూ లక్ష్యరహితంగా సముద్రం పైకి చూస్తూ "అయితే నా కొక అనుమానం" అన్నాడు.




"అడగండి, ఎన్ని అనుమానాలైనా సరే" అన్నాను నేను ఉత్సాహంగా.

"అలాగే - అలాగే-" అని ఒక్క నిముషం ఆగి మళ్లా అన్నాడు-"ఇంతకూ నేను పిచ్చివాణ్ణని ఎలా నిర్ధరించడం?"

నేను కొంచెం తెల్లబోయి మళ్ళా తేరుకొని, "అబ్బే మీకు పిచ్చేమిటి? మిమ్మల్ని అన్నవాడికి పిచ్చిగాక" అన్నాను.

"ఎగ్జాక్ట్లీ, కరక్ట్ రామారావుగారూ, నేను పిచ్చి కాగితాలేరుకుంటూ తిరుగుతూంటే చాలామంది ఒరేయ్ పిచ్చోడు-పిచ్చోడు" అంటూ నామీద రాళ్ళు రువ్వుతారు. కాని తమాషా "ఏమంటే నా కంటికి వాళ్లే పిచ్చివాళ్ళలా కన్పించి నేనూ వాళ్ళపై రాళ్ళు రువ్వుతుంటాను.. హ్హ హ్హ హ్హా-ఏమంటారూ బాగాలేదూ ..." అన్నాడు.

నేనేదో అనబోయే లోపలే మళ్ళీ మొదలుపెట్టాడు

"ముందు మెజారిటీ వాదం తీసుకుందాము. వందమంది కలిసి నల్లకాకిని తెల్లకాకి అన్నంత మాత్రాన కాకిరంగు మారుతుందా?? నలభై తొమ్మిది మంది మేధావులు ఈ సముద్రాన్ని సముద్రం అంటారనుకోండి — యాభై ఒక్కమంది కాదు— ఇదినేల అంటారు, ఇద్దరి మెజారిటీతో నీరు నేలగా మారిపోతుందా?? — మీ యూనివర్సిటీ పక్కనే వుంది చూడండి.

మా పిచ్చి వాళ్ళ స్వర్గం — అదే

లూనార్ పారడైస్. అందులో! మీరువస్తే అక్కడి వాళ్ళందరూ ఏకగ్రీవంగా మిమ్మల్ని పిచ్చివాడిగా భావించి కట్టి పడేస్తారు — అక్కడ మా మెజారిటీ యే నెగ్గుతొంది—'' అన్నాడు—

నిజమేననిపించింది నాకు

"ఇదిగో చూడండి రామారావుగారూ- ఈ కాలిమీద దెబ్బ తగిలింది చూడండి ఇది........డాబాగార్డెన్స్‌లో రోడ్డుమీద పోతూంటే ఓ గుంటడు రాయి విసిరాడు వాడెవడో నాకు తెలుసు—లాడ్జి పరంధామయ్య లేడూ వాడి కొడుకు అప్పల నరసింహం........."


లాడ్జి పరంధామయ్య పేరు నేనూ విన్నాను. విశాఖపట్నంలోని గౌరవనీయులైన రాజకీయ వేత్తలలో ఆయనా ఒకడు. చాలా పెద్దమనిషి పరంధామయ్య. ఆయన లేకుండా నగరంలో ఏసభా జరగదు—

"ఆయన లేకుండ నగరంలో ఏసభా జరగదు........" సరిగ్గా ఈ మాటతోనే బ్రిగిడియర్ ప్రారంభించాడు మళ్ళీ.... "పరంధామయ్య నాకు బాగాతెలుసు ఎంత బాగా తెలుసునంటే మీకెవ్వరికీ—ఈ సృష్టిలో ఎవ్వరికీ తెలియనంత బాగా తెలుసు — అందుకే కొన్ని విషయాలు చెపుతాను ఎవ్వరూ ఎరగని వి— వింటారా?—''

తల వూపాను—

బ్రిగిడియర్ మొదలు పెట్టాడు "ఈ పరంధామయ్య చిన్నప్పుడు చేపల వ్యాపారం చేసేవాడు మీహాస్టల్ అప్‌లాండ్స్‌కు అవతల పితలవానిపాలెం వుంది చూడండి అందులో కొంతమంది జాలరి వాళ్లు రోజూ ఈయనకు చేపలు అమ్మిపోతూ వుంటారు. అప్పుడాయన సనాతనిష్ఠ— వర్ణాలూ ఆచారాలూ అన్నీ నమ్మేవాడు— ఇలా వుండగా ఈ చేపలకట్ట నెత్తిన బెట్టుకొని వచ్చే అప్పలమ్మను రోజూ అలా చూడగా చూడగా పరంధామయ్య మతిచలించింది. అప్పలమ్మ అందంగానే వుంటుంది. అందరు జాలరిపిల్లల్లా చుట్ట తాగదు కాకుంటే వాళ్ళలాగా రవికె మాత్రం వేసుకోదు. అదే ఈ పరంధామయ్యను ముంచింది — అన్నట్టుండి రాత్రికి రాత్రిఅన్నాడు "నేను శంతనునిలా ఈ సత్యవతిని చేసుకుంటాను'' అని ఈ లోకంలో ఒక తమాషావుంది పేదవాడు ఒకతప్పు చేస్తే పాపమంటారు ద్రోహమంటారు. అదే ధనవంతుడు చేస్తే లీల అంటారు. విలాసమంటారు. "వాడికేం మహారాజు'' అంటారు. అంటే మహారాజులు తప్పులు చేయవచ్చుననాదీనిఅర్థం? ఏమయితేనేం ఎవ్వరూ వప్పుకోలేదు పరంధామయ్య సాహసానికి. కానీ పరంధామయ్య పట్టుదలకల మనిషి ఆర్యసమాజిష్టుల సహాయంతో తనపని నెరవేర్చుకున్నాడు—

అప్పటినుంచే మిస్టర్ రామారావ్! పరంధామయ్య పూర్తిగా దేశభక్తుడై పోయినాడు. ఎందుకలా మారాడో ఎవ్వ




రికీ తెలియదు. అప్పలమ్మ మత్స్య గంధి కాదు యోజనగంధి. కాబట్టే ఆమె సాంగత్యంతో ఈ పరంధామయ్య కీర్తి కూడా మైళ్ళకు మైళ్ళు వ్యాపించేది. "పరంధామయ్య పేద ప్రజలకు దానం చేస్తున్న చిత్రం" అని దిన పత్రికలలో ఓ ఫోటో పడేది. "కుంటివారి సేవలో పరంధాముడు' అః మరో చిత్రం "శ్రమదానంలో పరంధామయ్య" అని ఓ పార చేత్తో పుచ్చుకొని ఫొటో కోసమేనా అన్నట్లు నిలబడ్డ ఇంకో చిత్రం. "పల్లె ప్రజల గుడిసెలకోసం ప్రభుత్వం లక్ష మంజూరు చేయాలి'.—కార్మిక నాయకుడు పరంధామయ్య డిమాండ్—అని ఓ పతాక శీర్షిక. పరంధామయ్య ఫొటో, రామారావ్— పరంధామయ్య ఇలా దేశ సేవ రాత్రింబవళ్ళు చేయడం మొదలు పెట్టాడు. అయితే దేశసేవ కామధేనువు లాంటిది. ఎవరేం కోరితే అది ఇస్తుంది. ఓ రెండేళ్లు కాలం గడిచేసరికి పరంధామయ్య కీర్తి సౌధం ఆకాశాన్నంటింది. దానితోపాటు నిజమైనఓ రెండంతస్థులసౌధం కూడా డాబా గార్డెన్స్‌లో వెలిసింది. పరంధామయ్య జిల్లాలో తిరుగులేని నాయకుడైనాడు.

దీనితో పరంధామయ్యను సాక్షాత్తు దేవుడిలా ప్రజలు పూజించడం మొదలు పెట్టారు. రేవుకార్మికుల సంఘంలో ఓడకళాసీల కష్ట సుఖాలగురించి పరంధామయ్యే మాట్లాడాలి విశాఖ కళాహతుల సంఘంలో

దేవదాసీ వృత్తి నిరసన గూర్చి వృద్ధ వివాహాలు చెడుగును గూర్చి జరిపే సభకు పరంధామయ్యే అధ్యక్షత వహించాలి. పరంధామయ్య కూడా చాలా చమత్కారాలు నేర్చుకున్నాడు. సనాతన సభవారి గణేశోత్సవాలలో దేవుడున్నాడని ఎంత గట్టిగా మాట్లాడి నిష్కామ కర్మ యోగాన్ని—జగన్మిథ్యా తత్వాన్ని బోధిస్తాడో మేడే కార్మికుల ఊరేగింపుకు, నాయకత్వం వహించి దేవుడు లేడనీ కార్మికుడే దేవుడనీ పరంధామయ్య గట్టిగా మాట్లాడగలిగే నేర్పు సంపాదించాడు నరిసీపట్నం రోడ్డుగీత పని వారి సంఘంలో ఉదయం "కల్లు—దాని ప్రాముఖ్యము" గూర్చి ప్రసంగించిన పరంధామయ్య అదే ఊగు అదే తూగుతో సాయంత్రం కసింకోటలో నన్నయభట్టు భారతం పూర్తిగా వ్రాస్తే గీతకు వదిలే వాడు కాదు" అన్నంశాన్నిగూర్చి అమోఘంగా మాట్లాడేవాడు. చేపల మార్కెటులో అనామకుడుగా తిరిగే పరంధామయ్య ఇలా చూస్తుండగానే వామనత్వం వదిలి త్రివిక్రమత్వం దాల్చి దేశనాయకుడూ, దైవభక్తుడూ, సంఘసేవాపరుడూ, సాహితీవేత్తా సర్వమూ తానే అయిపోయాడు. వింటున్నావా శ్రద్ధగా రామారావ్—"

నేను నిజంగానే శ్రద్ధగా వింటూ వున్నాను—కేవలం పదో నెంబరు బస్సు ఒకటి ఆ దోవన పోవడం మినహాయించి మరేధ్వనీ విన్పడలేదు. సముద్రంకూడా ఎందుకనో నిశ్శబ్దంగా నిలబడి క్రిగిటీ యర్ చెపుతున్న కథ వింటున్నది.

'విను రామారావ్—ఇలా వుండగా పరంధామయ్య తన ఇంటిని నాలుగైదు భాగాలుగా విభజించి అద్దెలకిచ్చాడు. అందులో రమాపతి అనే ధనవంతుడు దిగాడు. ఆయన పరంధామయ్యకి దూరపు బంధువుకూడా. రమాపతి చాలా మోడరన్‌గా వుంటాడు. కేవలం ఇంగ్లీషు పిచి మాలే చూస్తాడు చెస్టర్ బెల్లాక్, హావలాక్ ఎల్లీస్, కోనన్‌డాయల్, ఆస్కార్ వైల్డ్ గ్రంధాలు తప్ప వేరే చదవడు ఆయన భార్య రోజారత్నం వికసించిన రోజాపువ్వులాగే వుంటుంది. రమాపతి చాలా ప్రోగ్రెసివ్. అర్ధనగ్నంగా అలంకరించుకున్న రోజాను వెంటబెట్టుకొని అలా అప్‌లాండ్స్‌వైపు షికారుకు వెళ్తుంటే వారి స్టయిల్స్ చూచి యూరోపియన్స్ ముక్కుపై వేలు వేసుకుంటారు. రోజా కూడా చాలా తెలివైనదే సూదిలా అంపిస్తే దబ్బనంలా ముందుకు చొచ్చుకొనిపోయే మనిషి పరంధామయ్య ఆమెను అధ్యక్షురాలినిగా చేసి ఓ క్లబ్బు కూడా తమ 'జలపుష్ప' అనే బిల్డింగ్‌లో స్థాపించాడు అందులో పరంధామయ్య ఇరవైనాలుగు గంటలూ పేకాడేవాడు. అదేమని ఎవరైనా అడిగితే ధర్మరాజు ఆడలేదా? అనేవాడు. ధర్మరాజు జూదంలో సర్వస్వమూ కోల్పోయాడు కాని పరం




ధామయ్య మాత్రం దాన్ని ఇంటర్నేషనల్ గాంబ్లింగ్ సెంటర్‌గా మార్చి వేలకు వేలు ఆర్జించాడు, 'వైన'తేయుడై ఈ నిషాతానీషా తెల్లవార్లూ తిల్లాడుతుంటే సమాజం, ఒకనాడు పరంధామయ్యను తిట్టిన ఆ నోటితోనే 'ఆయనకేం కారణజన్ముడు- లక్ష్మీపుత్రుడు - ఆయన మీన లగ్నంలో కర్కాటకం దూరి ది-అందుకే అంత గొప్పవాడైనాడు' అని పొగుడుతూ వుండేవారు ఇలా పరంధామయ్య సమాజం దృష్టిలో ఆదర్శప్రాయుడూ మర్యాద పురుషోత్తముడూ అయిపోయినాడు.

అంత గొప్పవాడింట్లో అద్దె కుంటున్నందుకూ, ఆయన తన వేలు విడిచిన మేనమామగారి తమ్ముడి భార్య పినతల్లికి స్వయంగా షడ్డకుడి బావగారైనందుకూ రమాపతి సంతోషించాడు. మొదట్లో నిజమేకాని కొన్నాళ్ళకు పరంధామయ్య జూదానికీ ఇంటర్నేషనల్ ఎక్స్‌పోర్టు అండ్ ఇంపోర్టు బిజినెస్‌కూ ఓ అయిదు వేలు, పదివేలు ఇలా చేబదులు పుచ్చుకొని మర్నాడు తీరుస్తానంటుంటే కొంచెం కష్టం వేసేది—ఇలా వున్నట్టుండి అకస్మాత్తుగా పరంధామయ్య ఓ రాత్రికి రాత్రి రమాపతి కాళ్ళుపట్టుకొని ఓ లక్షకావాలి అర్జంటు- పీకెలమీదికొచ్చింది ఇప్పుడు ఆదుకోక పోతే రేపు నా శవమే మిగులుతుంది' అన్నాడు రమాపతి ఓ క్షణం ఆలోచించి జంపుష్పను తాకట్టుపెట్టించుకొని ఓ లక్ష ఎక్కడినుంచో తెచ్చి ఇచ్చాడు రాత్రికి రాత్రే పరంధామయ్యకు గడం గడిచింది —అయితే మళ్ళీ రమాపతికి ముఖం మాత్రం చూపించలేదు

ఇలా వుండగా విదేశీ రాకీ తట్టుకునే

నిమిత్తం జలపుష్పకు ఓ పెద్ద ఇంటర్నేషనల్ హోటల్‌గా మార్చదలచి పరంధామయ్య అందరినీ ఖాళీ చేయమన్నాడు. రమాపతి తన లక్ష అడిగితే పరంధామయ్య ముఖం చిట్లించి 'లక్షా? ఏమి లక్ష??' అన్నాడు విచిత్రంగా—

'అదే! నేను మీకు బాకీయిచ్చిన మొత్తం' అని రమాపతి గాభరాగా అనగానే పరంధామయ్య ఓ నవ్వు నవ్వి 'రమాపతీ! ఇలాంటి పరాచికాలు నాతో ఆడితే ఆడావేమో కాని మరెవ్వరి దగ్గరా అనకు— నీకు మతిపోయిందనుకుంటారు. నీవేమిటీ, నీ దగ్గరేమిటీ, లక్ష తీసుకోవడమేమిటీ, అసలు నీ దగ్గర లక్ష ఉండటమేమిటీ....ఎవరన్నా వింటే ఎగతాళి పంచాంగం కాదూ! అన్నాడు. రమాపతి ఆక్రోశిస్తూ వెళ్ళి ఇనప్పెట్టి చూచుకుంటే అందులో తాకట్టు పత్రం కన్పించలేదు. ఆ దెబ్బతో నా లక్ష—నా లక్ష అంటూ రమాపతి బజారున పడ్డాడు. ప్రజలంతా వెర్రివెధవ—వాడికి లక్ష ఎక్కడిదీ అని పరంధామయ్య చెప్పినమాటే నిజమని నిరూపించారు రమాపతి రోజా రత్నం దగ్గరికి వచ్చేసరికి నాకు పిచ్చి మొగుడు వద్దు—ఎంచక్కా జలపుష్పమే కావాలి అంది. దానితో రోజారత్నం చేసిన ద్రోహం అర్థమై రమాపతి ఉద్రేకంతో చెయ్యి పైకెత్తి ఛాతీలో ఖాళీ చెయ్యి ఊపించి హత్యాప్రయత్నం చెయ్యబోయాడన్న నేరానికి పంరధామయ్య చేత ఓ సంవత్సరం జైలుకు కూడా పంపబడ్డాడు. 'నిజమే — దుష్టశిక్షణ — శిష్టరక్షణ — రమాపతి జైల్లో ఉండవలసిందే' అని సంతృప్తి చెందింది లోకం.

మిస్టర్ రామారావ్! ఇదొక కథ. సాంఘిక నియమాలూ, నైతికమైన చట్టాలూ ఏవీ పరంధామయ్యను బంధించవు. బైబిలూ భగవద్గీతా ఏ నీతి సూత్రాలూ పరంధామయ్యను దండించలేవు. పరంధామయ్య ఎందరిని చేసుకున్నా సరే 'సిరిగలవాడికి చెల్లును తరుణులు పదియారువేలు తను పెండ్లాడన్' అంటున్నది సమాజము. జలపుష్ప ఇంటరేషనల్ హోటల్‌కు కేంద్రమంత్రి ప్రారంభోత్సవం చేసి పరంధామయ్యలాంటి వారు మన స్వతంత్ర భారతదేశానికి మన ప్రజాస్వామ్య ఆర్థిక వ్యవస్థకూ మూలస్తంభాలూ—పట్టుకొమ్మలు—ఆధార శిలలు అని అనర్గళంగా ప్రసంగించాడు. పరమ సనాతనుడైన పేరి చిట్టిశాస్త్రి మహోపాధ్యాయుల వారు పరంధాముణ్ణి శివుడితో పోల్చి, అప్పలమ్మనూ రోజారత్నాన్ని గంగాగౌరి దేవతలతో ఉపమించి, శ్లేషలూ శ్లేషాలంకారాలూ ప్రయోగించి రసజ్ఞుల కరతాళ ధ్వనులందుకొని తన బుర్రనూ, బుర్రనూ కప్పివేస్తూ పరంధాముడు విసిరిన ఓ శాలువాతో సంతోషించి, ఓ నస్యం పట్టు లగాయించి మరీ దొండపర్తి దోవపట్టాడు ... రామారావ్ ఇప్పుడు చెప్పు? ఎవరి లోకం

లోపిచ్చివాళ్ళు?? నీ కళ్ళకు నేను పిచ్చివాణ్ణిగా కన్పడుతూ వుండవచ్చు—కాని నాకీదేశం మొత్తమూ ఓ పెద్ద లూనిటిక్ ఎసైలంలాగా కనపడుతున్నది. పరంధామయ్య ఈ మధ్య బియ్యం వ్యాపారం కూడా ప్రారంభించాడు ఆయన తలుచుకుంటే ఈ ఆంధ్రప్రదేశ్‌లోని ధాన్యాన్ని మొత్తాన్ని ఇరవైనాలుగు గంటలలో తన గోడౌన్స్‌లో స్తంభింపజేయగలడు — కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే పరంధామయ్యకు కడుపులో ఓ విధమైన నొప్పి వుంది. కేవలం రాగి జావ తప్ప మరేమీ తీసుకోకూడదు. చిటికెడు ఉప్పు కలిపిన ఓ గ్లాసెడు రాగిజావను తాగి పరంధామయ్య వాగెన్లకొద్దీ ధాన్యాన్ని తెచ్చి నిలువచేసుకొని ఆ బస్తాలుచూచి మురిసిపోతూ వుంటాడు. తమాషాగా వుంది కదూ—రోజా రత్నం స్థాయి కూడా హోటల్‌తోబాటు ఇంటర్నేషనల్ లెవల్‌కు పెరిగింది. ఆవిడ ఇప్పుడు ఫారిన్ వి. ఐ. పి లతో తప్ప విందుభోజనం చెయ్యదు. నిశాచరిలా తెల్లవార్లూ బాల్‌రూం డాన్సులుచేసి పగలంతా నిద్రపోతుంది. ఇదిచూచి పరంధామయ్య పైకి నవ్వుతూ లోపల కుళ్ళి కుళ్ళి ఏడుస్తుంటాడు అదేమని గట్టిగా అంటే 'సౌరవంతమైన పోషకుల పరంపరలో నీవు తెందోవాడివి' అని ముఖాన్నే అనేస్తుందని స్పష్టంగా తెలుసు. అందుకే ముఖానికి చిరునవ్వు అంటించుకొని తానీమధ్య ప్రతిష్టను తనకు తానే ఆరోపించుకొని అంతర్జాతీయ సమావేశాల్లో బల్లలు గుద్ది మాట్లాడి నిజజీవితానికి దూరంగా కేవలం చప్పట్ల మధ్యా. పూలదండల మధ్యా ఓ సరికొత్త స్వర్గం నిర్మించుకొని పిచ్చాసుపత్రిలో చేరకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు ...'

నేను ఊపిరి బిగబట్టి వింటూన్నాను. ఇంతవరకూ చెప్పి ఒక్క వెర్రి నవ్వు నవ్వాడు బ్రిగేడియర్. ఇప్పటిదాకా ఉన్న స్థిరత్వమూ ప్రశాంతతా చూస్తుండగానే కరిగిపోయి మనిషి నిలువునా కదిలిపోయాడ 'మరింతకూ రమాపతి ఏమైనట్లూ' అని అడిగాను నేను కుతూహలంతో—

తన లక్షరూపాయల తాకట్టు పత్రం కోసం చాలా ఓర్పుతో ఏ కురుపాం మార్కెట్టు దగ్గర చెత్త కుండీల్లోనో, కిర్లంపూడి హాస్టల్ వెనుక మురికి గుంటల పక్కనో నేటికీ అలా వెతుకుతూనే ఉన్నాడు—నీవు చూడలేదేమిటి రామారావ్—'' అని మళ్ళీ ఓసారి పెద్దగా వెర్రినవ్వు నవ్వి ఎవరో తరిమితే పరుగెత్తినట్లు అలా సముద్రం ఒడ్డునే పరుగెత్తుకుంటూ పోయాడ. అప్ లాండ్స్ వైపుకు బ్రిగేడియర్.